కేఎల్‌ఐ కాల్వలు అధ్వానం

- అస్తవ్యస్తంగా నిర్వహణ
- పట్టించుకోని అధికారులు
- ఇబ్బందులు పడుతున్న రైతులు, ప్రజలు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని పలు గ్రామాలకు సంబంధించిన రైతుల పంట పొలాలకు సాగునీరు అందించే కేఎల్‌ఐ మొదటి లిఫ్టుకు చెందిన ప్రధాన కాల్వకు అనుసంధానంగా ఉన్న కాల్వల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. పంట కాల్వలలో ఎక్కడ చూసినా ఏపుగా పెరిగిన జమ్ము, పిచ్చి మొక్కలే కన్పిస్తున్నాయి. పంట దీంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కేఎల్‌ఐ ప్రాజెక్టు ప్రారంభమై దాదాపుగా 14 సంవత్సరాలు కావొస్తున్న పంట కాల్వల నిర్వహణ ప్రాజెక్టు ఇంజనీర్ అధికారులు పట్టంచుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రతి సంవత్సరం వానాకాలం, యాసంగి సీజన్‌లో కాల్వలను శుభ్రం చేయాలని పాలకులకు, అధికారులకు విన్నవించినా పెడచెవిన పెడుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

కాల్వల సాగునీరే ఆధారం

మండలంలోని 15 గ్రామ పంచాయతీల రైతుల కాల్వల సాగునీరుపై ఆధారపడి పంటలు సాగుచేస్తున్నారు. అనాధికారంగా 50 వేల ఎకరాల వరకు శిస్తూ అవుతోంది. ప్రధాన కాల్వలకు అనుసంధానంగా ఐదు పంటకాల్వలు ఉన్నాయి. చివరి ఆయకట్టువరకు సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. ప్రస్తుతం కాల్వలు జమ్ముతో నిండి ఉన్నాయి. ఇప్పటికైనా ప్రాజెక్టు అధికారులు స్పందించి కాల్వలను శుభ్రం చేయాలని రైతులు కోరుతున్నారు. కాల్వలో జమ్ము, పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడంతో విష సర్పాలు కూడా ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. రాత్రి సమయాలలో రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోతున్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేక చొరవ తీసుకొని కాల్వలు శుభ్రం చేయాలని కోరుతున్నారు.


కుడికిల్ల గ్రామ సమీపంలో ఉన్న పంట కాల్వలో ఏపుగా పెరిగిన జమ్ము

సొంత ఖర్చులతో జమ్ము తొలగించాం



నార్లాపూర్ గ్రామ సమీపంలో ఉన్న కేఎల్‌ఐ పంట కాల్వ కింద పంటలు సాగు చేశాను. కాల్వలో జమ్ము ఏపుగా పెరిగింది. ఇప్పటికీ రెండు సార్లు రైతులందరం కలిసి సొంత ఖర్చులతో శుభ్రం చేసుకున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి పంట కాల్వను శుభ్రపరచాలి.

– పోతుగంటి శ్రీనివాసులు, రైతు, కుడికిల్ల

కాల్వలను శుభ్రం చేయాలి



కేఎల్‌ఐ ప్రధాన కాల్వకు అనుసంధానంగా నార్లాపూర్, కుడికిల్ల గ్రామాల శివారులో ఉన్న కాల్వలను శుభ్రం చేయాలి. ఏపుగా పెరిగిన జమ్మును తొలగించాలి. అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. పంటలు ఎండకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

– ఎల్లపోగు పకీరయ్య, కుడికిల్ల రైతు

ప్రతిపాదనలు పంపించాం

పంట కాల్వల నిర్వహణపై ఉన్నత అధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు అయిన వెంటనే కాల్వలను శుభ్రం చేయిస్తాం. కాల్వలలో జమ్ము పెరగకుండా చర్యలు తీసుకుంటాం. రైతులకు సాగునీరు అందించేందుకు కృషి చేస్తాం. చివరి ఆయకట్టు రైతుల పొలాలకు సాగునీరు వెళ్లేలా అవసరమైన చర్యలు చేపడుతాం.

– అమర్‌సింగ్, ప్రాజెక్టు డీఈ

గిరిజన హక్కుల గర్జన పోస్టర్లు విడుదల

కొల్లాపూర్ రూరల్: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆగస్టు 11న నిర్వహించే రాష్ట్ర స్థాయి గిరిజన హక్కుల గర్జనకు సంబంధించిన పోస్టర్లను సోమవారం చాంబర్‌లో ఆర్డీఓ బన్సీలాల్ నాయకులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ నాయక్ మాట్లాడుతూ రాజ్యాంగంలోని గిరిజన హక్కులను కాపాడుకుందామన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు దశరథం, గోవిందు, తిరుపతి, గోపాల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ ఆకస్మిక తనిఖీ

లింగాల: సమయపాలన పాటించి విధులు నిర్వహించాలని మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండలంలోని కొత్తకుంటపల్లి, అవుసలికుంట ప్రాథమిక పాఠశాలలను ఎంఈఓ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యా సంబంధిత అంశాల అమలును పరిశీలించారు. పీటీఎం నమోదు వివరాలను తెలుసుకున్నారు. ఎఫ్‌ఏ–1 పరీక్షల నిర్వహణపై ఉపాధ్యాయులతో చర్చించారు. పాఠశాలల్లో ప్రీప్రైమరీ బోధన మంజూరి అయినందున అంగన్‌వాడీ ఉపాధ్యాయులతో నాలుగు సంవత్సరాల బాలబాలికల వివరాలు సేకరించాలని సూచించారు. ఆయా పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలును పరిశీలించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.50 వేలు విరాళం

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని హనుమాన్ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న పోచమ్మ దేవాలయ నిర్మాణానికి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ రూ.50 వేలు విరాళంగా ప్రకటించారు. ఈ మేరకు సోమవారం కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ శ్రీశైలం చేతుల మీదుగా ఆలయ కమిటీ సభ్యులకు డబ్బులను అందించారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ విజయ్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ కొండూరు గోవర్దన్, కాటన్ మిల్ గుర్తింపు అధ్యక్షుడు సూర్య ప్రకాష్ రావు, భగత్ సింగ్, బొట్టు రాజు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీతోనే పేదల సంక్షేమం

వెల్దండ: బీజేపీతోనే పేదల సంక్షేమం సాధ్యమని మాజీ బీసీ కమిషన్ సభ్యుడు ఆచారి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆకృతి గార్డెన్‌లో బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. వచ్చే జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను భారీ మెజార్టీలతో గెలిపించుకుందామన్నారు. హామీల అమలులో కాంగ్రెస్ విఫలం అయ్యిందన్నారు. అనంతరం కార్యకర్తలకు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో కల్వకుర్తి కన్వీనర్ శేఖర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు యాదగిరి, రాజేందర్‌రెడ్డి, దుర్గాప్రసాద్, నరసింహ, శ్రీనివాసచారి తదితరులు ఉన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



కల్వకుర్తి రూరల్: పట్టణంలో ఆగస్టు 10న గద్దర్ విగ్రహావిష్కరణ చేయనున్న సందర్భంగా దీనికి సంబంధించిన పోస్టర్లను సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట జిల్లా ఎస్సీ ఎస్టీ మానిటర్, విజిలెన్స్ కమిటీ నంబర్ జిల్లెల రాములు, మాజీ సర్పంచ్ ఆనంద్ కుమార్ విడుదల చేశారు. కార్యక్రమంలో శేఖర్, దామోదర్ గౌడ్, మిర్యాల శ్రీనివాస్ రెడ్డి, షానవాజ్ ఖాన్, జగన్, జంగయ్య, రవి గౌడ్, జంగయ్య గౌడ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతర పోరాటం


సభ్యత్వాలు నమోదు చేయిస్తున్న పీఆర్టీయూ నాయకులు

ఉప్పునుంతల: ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతర పోరాటం చేస్తోందని టీఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బిచ్చనాయక్ అన్నారు. సోమవారం పీఆర్టీయూ ఉప్పునుంతల మండలశాఖ ఆధ్వర్యంలో జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేయించారు. కేజీబీవీ ఉపాధ్యాయులకు టైం స్కేల్ ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను ఇవ్వాలని, 317 జీఓను అమలుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర నాయకులు, శ్యాం సుందర్‌గౌడ్, మల్లికార్జున్, అజ్మతుల్లా, మండల అధ్యక్షుడు నర్సింహరెడ్డి, ఎండీ అమీర్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు దొడ్ల సత్యానారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాలతో సభ్యత్వ నమోదు చేపట్టారు. ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం పనిచేస్తున్నామన్నారు. రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కమాలాకర్ రావు, మండల అధ్యక్షుడు జంగు నాయక్, ప్రధాన కార్యదర్శి సుధాకర్, మండల కార్యవర్గ సభ్యులు, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

సమాజసేవతోనే జీవితం సార్థకం


వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట రూరల్: సమాజసేవతోనే జీవితం సార్థకం అవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. కౌన్సిలర్ అప్పశివ ఆధ్వర్యంలో నవంబర్ 16న అచ్చంపేటలో నిర్వహించే ఉచిత సామూహిక వివాహాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఎమ్మెల్యే విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజ సేవకు పాటుపడాలన్నారు. అచ్చంపేట ప్రాంతంలో ఉచితంగా సామూహిక వివాహాలు చేయడానికి ముందుకు వచ్చిన కౌన్సిలర్ అప్పశివను ఎమ్మెల్యే అభినందించారు. సామూహిక వివాహాలు చేసుకునే వారు పట్టణంలోని లింగాల రోడ్డులో ఉన్న అప్పశివ జ్యూవెల్లర్స్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని నిర్వాహకులు పేర్కొన్నారు. బంగారు పుస్తె, వెండి మెట్టెలతో పాటు వధూవరులకు దుస్తులు, బీరువా, ఇతర గృహోపకార వస్తువులు ఇస్తామని వివరించారు. వివరాలకు సెల్: 7661008966 ను సంప్రదించాలని కోరారు.

రేషన్‌కార్డులు పంపిణీ

అచ్చపేట పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్ నిర్వహించిన సమావేశంలో మండలంలోని లబ్ధిదారులకు రేషన్‌కార్డులను ఎమ్మెల్యే వంశీకృష్ణ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పార్టీలకతీతంగా పారదర్శకంగా ప్రభుత్వ ఫలాలు అందిస్తున్నామన్నారు. గత పాలకులు ఒక్క రేషన్‌కార్డు ఇచ్చిన దాఖలాలు లేవని విమర్శించారు. రైతులందరికీ రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రైతు బీమా, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, ఆర్టీసీ బస్సులో మహిళలకు ఉచిత ప్రయాణం ఎన్నో సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ మాధవి, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, రెవెన్యూ, సివిల్‌సప్లయ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జంగిరెడ్డి సేవలు మరువలేనివి

దివంగత డాక్టర్ మంద జంగిరెడ్డి నల్లమల ప్రాంత ప్రజలకు చేసిన వైద్యసేవలు మరువలేనివని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. జంగిరెడ్డి 31వ వర్ధంతి సందర్భంగా సోమవారం బొల్లట్‌పల్లి గేటు సమీపంలో లెనిటీ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జంగిరెడ్డి తనయుడు శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వైద్యులు అందుబాటులో ఉండాలి


తనిఖీలు చేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.తారాసింగ్

మన్ననూర్: ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డా.తారాసింగ్ సూచించారు. మన్ననూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సోమవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించడంతో పాటు ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తిచెందే అవకాశం ఉన్నందున వైద్యులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అంతకు ముందు గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల వసతిగృహాన్ని ఆయన సందర్శించి.. నిత్యావసర వస్తువులు, కూరగాయలు, పప్పులు, వాటర్ ప్లాంట్ పనిచేస్తున్న విధానం, ఉపయోగించుకుంటున్న తీరును పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలన్నారు. భోజన తయారీ సమయంలో హెచ్‌డబ్ల్యూఓ, మరో ఇద్దరు ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని తెలిపారు.మూత్రశాలలు, మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని హెచ్‌డబ్ల్యూఓ తిరుపతమ్మకు సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి సుధాకర్, సిబ్బంది మార్తమ్మ, హరి, లక్ష్మణ్, రామలింగమ్మ, లక్ష్మి ఉన్నారు.

సీపీఐ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి


కల్వకుర్తిలో ప్రచారం నిర్వహిస్తున్న భరత్

కల్వకుర్తి రూరల్/తెలకపల్లి/పెంట్లవెల్లి: కల్వకుర్తిలో ఆగస్టు 1, 2వ తేదీల్లో నిర్వహించే సీపీఐ జిల్లా మూడో మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొమ్ము భరత్ కోరారు. సోమవారం పట్టణంలో సభలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం పట్టణంలో ప్రచారం చేశారు. అదేవిధంగా పెంట్లవెల్లిలో సీపీఐ మండల కన్వీనర్ దేవసహాయం, తెలకపల్లిలో సీపీఐ మండల కార్యదర్శి రవిందర్, రైతు సంఘం నాయకులు సూర్యశంకర్ గౌడ్‌లు వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో శివ, లక్ష్మీ, గోపాల్, ప్రేమ్‌కుమార్, సత్యం, నరేష్, శ్రీను, నిరంజన్, సత్యనారాయణ రవీందర్, శంకర్‌గౌడ్, ఆంజనేయులు, కుర్మయ్య, మల్లేష్, శివ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు గణితంపై ఆసక్తి పెంపొందించాలి


ముష్టిపల్లి పాఠశాలల్లో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న డీఈఓ రమేష్‌కుమార్

పెద్దకొత్తపల్లి: విద్యార్థులకు గణితంపై ఆసక్తి పెంపొందించాలి డీఈఓ రమేష్‌కుమార్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం మండలంలోని ముష్టిపల్లి ప్రాథమిక పెరుమాలపల్లి ప్రాథమిక పాఠశాల, ముష్టిపల్లి ఉన్నత పాఠశాలలను డీఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ముష్టిపల్లి ఉన్నత పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థుల గణిత సామర్థ్యాలను పరిశీలించి విద్యార్థులకు గణితంలో రాణించేలా మెళకువలను డీఈఓ బోధించారు. ముష్టిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. గతేడాది మూతపడిన పెరుమాలపల్లి ప్రాథమిక పాఠశాలను పునఃప్రారంభించినట్లు పేర్కొన్నారు. విద్యార్థుల హాజరుశాతం నూరుశాతం ఉండాలన్నారు. డీఈఓ వెంట సమగ్ర శిక్షణ కోఆర్డినేటర్ నూర్దీన్ ఉన్నారు.

కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డికి నివాళి


జైపాల్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, కార్యకర్తలు

వెల్దండ/కల్వకుర్తి రూరల్: మండలంలోని కొట్రగేట్ వద్ద కేంద్ర మాజీ మంత్రి జైపాల్‌రెడ్డి వర్ధంతి సోమవారం కాంగ్రెస్ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణలు వేర్వేరుగా హాజరై విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జైపాల్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. కాంగ్రెస్ పార్టీలో జైపాల్ రెడ్డి చెరగని ముద్రవేశారన్నారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో ఆయన క్రియాశీల పాత్ర పోషించారన్నారు. అదేవిధంగా హైదరాబాద్ లోని స్ఫూర్తి స్థల్ వద్ద జైపాల్‌రెడ్డి సమాధిపై ఎమ్మెల్యే కసిరెడ్డి పూలుచల్లి నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు భూపతిరెడ్డి, ఆనంద్‌కుమార్, సంజీవ్‌కుమార్, పర్వత్‌రెడ్డి, బచ్చు రామకృష్ణ, శేఖర్, ఎర్ర శ్రీను, రమేష్ తదితరులు ఉన్నారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

నాగర్‌కర్నూల్ క్రైం: మద్యం తాగి వాహనం నడుపుతూ పట్టుబడిన ఇద్దరు వ్యక్తులకు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ గోవర్దన్ సోమవారం తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం పెద్దకార్పుల గ్రామానికి చెందిన ఎల్లయ్య, గగ్గలపల్లి గ్రామానికి చెందిన నాగరాజు మద్యం తాగి వాహనం నడుపుతుండగా పట్టుబడ్డారు. ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శృతి దూత ఎదుట హాజరుపర్చగా ఎల్లయ్యకు ఒకరోజు, నాగరాజుకు రెండు రోజులు జైలు శిక్ష విధించనట్లు పేర్కొన్నారు.

ఎరువుల విక్రయాల నమోదు తప్పనిసరి

తిమ్మాజిపేట: ఎరువుల విక్రయాల నమోదు తప్పనిసరిగా చేయాలని మండల వ్యవసాయ అధికారి కమల్ కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని సోమవారం ఏఓ ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలోని పలు రికార్డులను, ఎరువుల స్టాక్ వివరాలను ఆయన పరిశీలించారు.ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సిబ్బంది, డీలర్లు ఉన్నారు.

ఆలయ కమిటీ ఎన్నిక

తెలకపల్లి: మండల కేంద్రంలో ఎల్లమ్మ దేవాలయ మండల కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాలయ్య గౌడ్, గౌరయ్య గౌడు, లింగన్నగౌడ్, ప్రధాన కార్యదర్శిగా మల్లేష్‌గౌడ్, రమేష్‌గౌడ్, మహేష్‌గౌడ్, సలహాదారులుగా యాదయ్యగౌడ్,సుమన్ గౌడ్, సురేష్‌గౌడ్,సంతోష్‌గౌడ్‌లు ఎన్నికయ్యారు.

కిక్ బాక్సింగ్ పోటీలలో ప్రతిభ

లింగాల: ఖేలో ఇండియాలో భాగంగా రాష్ట్ర స్థాయి బాలికల విభాగంలో నిర్వహించిన ఆస్మిత కిక్ బాక్సింగ్ 2025–26 పోటీలలో మండలానికి చెందిన ఇద్దరు చిన్నారులు ప్రతిభ కనబర్చి బంగారు, రజత పతకాలను సాధించారు. ఈ నెల 26, 27 తేదీలలో రెండు రోజుల పాటు హైదరాబాద్‌లోని ఇండోర్ స్టేడియం బ్యాడ్మింటన్ హాల్, ఎల్బీ స్టేడియం బషీర్‌బాగ్‌లో నిర్వహించిన బాలికల రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొన్న లింగాల బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలకు చెందిన విద్యార్థిని(5వ తరగతి) రష్మిక 26 కేజీల చిల్డ్రన్ ఫైట్ విభాగంలో మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకాన్ని సాధించింది. 30 కేజీల చిల్డ్రన్ ఫైట్‌లో దారారానికి చెందిన దీక్షితబాయి రజత పతకాన్ని కైవసం చేసుకుంది. 37 కిలోల యూత్ ఫైట్‌లో హర్షిత ప్రశంసా పత్రాన్ని అందుకుంది. కిక్ బాక్సింగ్‌లో ప్రతిభ కనబర్చిన చిన్నారులను పలువురు అభినందించారు.

ఘనంగా నాగుల చవితి

లింగాల: శ్రావణ మాసంలో వచ్చే తొలి పర్వదినం నాగుల చవితిని సోమవారం మండలంలో మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టలలో, దేవాలయాలలో ఉన్న నాగదేవతకు పాలు పోసి పూజలు చేశారు.

కేసు నమోదు

కొల్లాపూర్ రూరల్: పట్టణంలో ఉన్న మెకానిక్ దుకాణం, చెప్పుల దుకాణాల యజమానులు చిన్నారులు పనుల్లో పెట్టుకునట్లు సోమవారం ఆపరేషన్ ముస్కర్ బృందం గుర్తించింది. ముస్కర్ బృందం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ హృషికేష్ తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన

తాడూరు: మండల కేంద్రంతో యటిదారిపల్లి, అకునెల్లికుదురు గ్రామాలలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇళ్లను ఎంపీడీఓ ఆంజనేయులు పరిశీలించారు. అయన వెంట హౌసింగ్ ఏఈ రాజవర్ధన్‌రెడ్డి, ఎంపీఓ నర్సింహ,కార్యదర్శులు తదితరులు ఉన్నారు.

మొక్కల పంపిణీ

తాడూరు: మండల కేంద్రంలో కుచుకుళ్ళ సౌభాగ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలకు సోమవారం డీవైఎఫ్‌ఐ జిల్లా నాయకులు కుర్మయ్య మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీవైఎఫ్‌ఐ నాయకులు, ఉపాధ్యాయులు, తదితరులుపాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



వెల్దండ: మండల కేంద్రంలోని అయ్యబావి వీరభద్ర స్వామి దేవాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణమాసంలో తొలి సోమవారం కావడంతో ఆలయంలో స్వామి వారికి అభిషేకం, హోమం, తదితర పూజలు నిర్వహించారు. అదేవిధంగా దక్షిణకాశిగా ప్రసిద్ధిగాంచిన గుండాల దేవాలయంలో అంబా రామలింగేశ్వరస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం కొనసాగింది. కార్యక్రమంలో పరమేశ్వర్, చంద్రశేఖర్, ఈశ్వరప్ప, కుమారప్ప, సర్వేశ్వర్, ఉమేష్, నందీశ్వర్ తదితరులు ఉన్నారు.

సీఎం నైతిక బాధ్యత వహించాలి

కందనూలు: ఉయ్యాలవాడ బాలికల గురుకుల పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు అస్వస్థత అయినే నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నైతిక బాధ్యత వహించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్ ఆరోపించారు. సోమవారం బీఎస్పీ ఆధ్వర్యంలో బాలికల గురుకుల పాఠశాల సందర్శించారు. ప్రిన్సిపాల్ పాఠశాల సందర్శనకు అనుమతి లేదని గేట్ తాళం వేయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యాశాఖ మంత్రిని కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రాతినిధ్యం ఇవ్వాలి

కొల్లాపూర్ రూరల్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు ప్రాధాన్యం ఇవ్వాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక ఇండియా జిల్లా మహిళ అధ్యక్షురాలు మూలె నారాయణమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో దివ్యాంగులతో కలిసి సీనియర్ అసిస్టెంట్ గోవింద రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఛత్తీస్‌ఘడ్, రాజస్థాన్, తమిళనాడు రాష్ట్రాల మాదిరిగా తెలంగాణ రాష్ట్రంలో కూడా స్థానిక సంస్థలలో ప్రాతినిధ్యం ఇవ్వాలన్నారు. నామినేటెడ్ సభ్యులుగా నియమించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు బండి అశన్న, రామకృష్ణ, రాఘవేందర్, జీజీపాషా, మాధవి, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కోడేరు: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు అవకాశం కల్పించాలని తహసీల్దార్ విజయ్ కుమార్, ఎంపీడీఓ శ్రావణ్‌కుమార్‌కు మండల కన్వీనర్ రాములు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అచ్యుత్, కార్తీక్, బాలు నాయక్, తదితరులు పాల్గొన్నారు.

మేకల చోరీ

ఊర్కొండ: మండలంలోని మాదారం గ్రామానికి చెందిన ఎల్లయ్య ఇంటి సమీపంలోని షెడ్డులో ఆది వారం రాత్రి మేకలను కట్టి ఉంచాడు. సోమవారం ఉదయం లేచిచూసే సరికి 20 మేకలు కన్పించలేదు. దొంగలు ఎత్తుకెళ్లినట్లు భావించి బాధితుడు పోలీసు లకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ కృష్ణదేవ పేర్కొన్నారు.

మహిళ అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: మహిళా అదృశ్యం ఘటనపై సోమవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని హౌజింగ్ బోర్డు కాలనీకి చెందిన షేక్ తస్లీంబేగం ఈనెల 24న భర్తతో గొడవపడి అడ్డాకుల మండలంలోని వేముల గ్రామంలోని పెద్దమ్మ ఇంటికి వెళ్లున్నానని చెప్పి తన కుమారుడిని తీసుకుని వెళ్లింది. ఎంతకీ పెద్దమ్మ ఇంటికి వెళ్లకపోవడంతో చుట్టు పక్కల గ్రామాల్లో, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభ్యంకాలేదు. దీంతో బాధిత కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పండ్లు పంపిణీ

ఉప్పునుంతల: స్వర్గీయ డాక్టర్ మంద జంగిరెడ్డి 31వ వర్ధంతిని పురష్కరించుకొని ఆయన కుమారుడు మంద శ్రీనివాస్‌రెడ్డి (ఫారెస్టు డిపార్ట్‌మెంట్) స్థానిక పీహెచ్‌సీలో సోమవారం రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య

ఉప్పునుంతల: ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందుతుందని ఎంఈఓ చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండలంలోని దేవదారికుంటతండా, కేజీబీవీ పాఠశాలలను ఎంఈఓ సందర్శించారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల విద్యా ప్రగతిని ఎంఈఓ పరిశీలించారు. కేజీబీవీలో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని ఎంఈఓ తనిఖీ చేశారు. స్టోర్ రూంలో ఉన్న కూరగాయలు, నిత్యవసర సరకులను పరిశీలించారు. తాజాగా ఉన్న కూరగాయలు, నిత్యవసర సరకులను మాత్రమే వంటకు వినియోగించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కేజీబీవీ స్పెషలాఫీసర్ సైదాకు సూచించారు.

విద్యా సామర్థ్యాలను పెంపొందించాలి

కొల్లాపూర్ రూరల్: విద్యా సామర్థ్యాలను పెంపొందించాలని మండల విద్యాధికారి ఇమ్మనుయేల్ ఉపాధ్యాయులకు సూచించారు. సోమవారం పట్టణ సమీపంలో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు పట్టిక, రికార్డులు, టీచర్స్ అటెండెన్స్, మెనూ రిజిస్టర్, విద్యార్థులు రాసిన నోటు బుక్స్ తనిఖీ చేశారు. అనంతరం వంటగదిని పరిశీలించారు. ఈగలు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రిజిస్టర్‌లో ఉపాధ్యాయుల సంతకాలు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా బోనాల పండుగ



తెలకపల్లి: మండలంలోని గౌరారంలో పోచమ్మ బోనాల పండుగ నిర్వహించారు. సోమవారం కోట మైసమ్మ ఆలయం నుంచి మహిళలు ఊరేగింపుగా వెళ్లి గ్రామ శివారులోని పోచమ్మ దేవత ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారికి నైవేద్యాన్ని సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కుటుంబసమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. శివసత్తులతో మహిళలు ఊరేగారు. డప్పు చప్పులతో పోచమ్మ దేవతకు పూజలు చేశారు. కొందరు మొలక బుట్లతో అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

పెన్షన్లు పెంచాలి

కొల్లాపూర్ రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్‌దారులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం వెంటనే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు చేయూత పెన్షన్లు వెంటనే పెంచాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా ఇన్‌చార్జ్ కుంట్ల గోపి మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని సోమశిలలో దండోరా, దివ్యాంగుల సమావేశం నిర్వహించారు. పెన్షన్లు పెంచకపోతే హైదరాబాద్‌లో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం గ్రామ, మండల కమిటీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో దండోరా మండల ఇన్‌చార్జ్ ఏదుల రాముడు, దండోరా నాయకులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

చారకొండ: శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని డీఎస్పీ వెంకట్ రెడ్డి అన్నారు. కల్వకుర్తి డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సోమవారం మొదటిసారిగా చారకొండ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. పరిసరాలను సందర్శించారు. అనంతరం స్టేషన్‌లో రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ వెంకట్ రెడ్డి మట్లాడుతూ స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలన్నారు. ఎస్‌ఐ శంషోద్దిన్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న మెడికల్ క్యాంప్

కందనూలు: నాగర్‌కర్నూల్ పరిధిలోని ఉయ్యాలవాడ మహాత్మాగాంధీ జ్యోతిరావుపూలే గురుకులం విద్యాలయంలో మెడికల్ క్యాంప్ సోమవారం కొనసాగింది. సోమవారం ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని వార్తలు వచ్చిన నేపథ్యంలో జిల్లా గురుకుల ఇన్‌చార్జ్ ప్రశాంతిని ఫోన్ ద్వారా సంప్రదించగా పాఠశాలలో ఏ విద్యార్థికి ఎలాంటి ఇబ్బంది కలగలేదని, వాంతులు, కడుపునొప్పి లాంటిది ఎక్కడ జరగలేదని ఆమె తెలిపారు. విద్యార్థికి ఎలాంటి సమస్య వచ్చిన పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, మెడికల్ సిబ్బంది అందుబాటులోనే ఉన్నారని తెలిపారు.

డిగ్రీ ప్రవేశాలకు 31వరకు గడువు

బల్మూర్: మండలంలోని కొండనాగుల ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఈ నెల 31 వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పరంగి రవి సోమవారం ప్రకటనలో తెలిపారు. దోస్త్ ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్లు కొనసాగుతున్నాయని వివరించారు.

అదనపు కలెక్టర్‌కు వినతి

కందనూలు: సంక్షేమ హాస్టళ్లకు, గురుకులాలకు, కేజీబీవీ హాస్టళ్లకు పాఠశాలలకు నాణ్యమైన బియ్యాన్ని అందించాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ డిమాండ్ చేశారు. సోమవారం అడిషనల్ కలెక్టర్ దేవ సహాయంకు కెవిపిఎస్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.